# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 4 | సంచిక: 29 | పేజీలు: 4 | వెల: రూ.4/- | మంగళవారం 29 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## తెలంగాణ అభివృద్ధికి ప్రధాని
# సహకరించడం లేదు

**మెట్రో రైల్, ట్రిబుల్ ఆర్ విస్తరణకు అడ్డుపడుతున్న కేంద్రం**

**ఎన్నికల కమిషన్ ను...లాలా సైమన్ కమిషన్ లా వాడుతున్న బిజెపి**

**తెలంగాణ ప్రయోజనాల కోసమే ఢిల్లీ పర్యటనలు.. నేడు కేంద్ర మంత్రులతో కలవనున్న సీఎం రేవంత్**

**ప్రతిదిన్ మీడియా నెట్వర్క్ 'ది కాంక్లేవ్ 2026'లో సీఎం రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28 (నమస్తే ఉదయం)**

తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకరించడం లేదని, ఆర్ఆర్ఆర్‌కు టెండర్ల సమయానికి కేంద్రం అనుమతులను అడ్డుకుందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ప్రతిదిన్ మీడియా నెట్వర్క్ 'ది కాంక్లేవ్ 2026'లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నార్త్ వర్సెస్ సౌత్ కాదు, గుజరాత్ వర్సెస్ దేశం అన్నట్లుగా ఉందని విమర్శించారు. యూపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మోదీ నిధులు గుజరాత్‌కు మళ్లిస్తున్నారని ఆరోపించారు. డీలిమిటేషన్‌లో జనాభా మేరకు సీట్లు పెంచితే పెద్ద రాష్ట్రాలకు మేలని చిన్న రాష్ట్రాలకు నష్టమని తెలిపారు. తాము పేదల వైపు ఉంటే బీజేపీ సంపన్నుల వైపు ఉందని పేర్కొన్నారు. పేదల ఓటు హక్కు తొలగించడానికే ఎస్ఐఆర్ తీసుకొచ్చారని, 2029 ఎన్నికల కోసం దేశంలో 13 కోట్ల ఓట్లు తొలగించారని రేవంత్ ఆరోపించారు. బ్రిటిషర్లు సైమన్ కమిషన్ తెచ్చినట్లు ఈసీని మోదీ వాడుకుంటున్నారని ఆక్షేపించారు. దేశంలో జనాభా తగ్గకుండా ఓట్లు మాత్రమే ఎలా తగ్గుతాయని ప్రశ్నించారు. తనకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లు తొలగించాలని మోదీ ప్రయత్నిస్తున్నారని, దేశంలో 20 కోట్ల ఓట్లు తొలగించాలని చూస్తున్నారని వెల్లడించారు. మొత్తం అధికారాలను ఢిల్లీలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఇచ్చారని అన్నారు. మరి బీఎల్‌ఏలు,




బీఎల్‌వోలు, కలెక్టర్లు ఎందుకని నిలదీశారు. ఎస్ఐఆర్ గోబ్యాక్ అని నినదిస్తూ దేశమంతా ఏకం కావాలని రేవంత్ రెడ్డి దేశంలో ప్రజల సంఖ్య పెరుగుతుంటే, ఓటర్ల సంఖ్య తగ్గుతుంది : ప్రధాని మోడీ మాయాజాలంపిలుపునిచ్చారు.

**బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదు**

తెలంగాణలో విద్యార్థి సంఘాలు చాలా తక్కువని, లెఫ్ట్, రైట్ సంఘాలున్నాయని సీఎం తెలిపారు. ఎన్ఎస్ఐయూ ప్రభావం పెద్దగా లేదని, ఉత్తర భారతదేశంలో, దక్షిణ భారతదేశంలో రాజకీయాల శైలి వేరని, మా దగ్గర యూనివర్సిటీ లా కాలేజ్, ఆర్ట్స్ కాలేజీ నాయకునిగా ఏబీవీపీలో గెలిచిన వారు తర్వాత కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని గుర్తు చేశారు. యూనివర్సిటీలో విద్యార్థి సంఘంలో ఉన్నా, గ్రామానికి వెళ్లిన తర్వాత ఆ కుటుంబం కాంగ్రెస్‌లోనే ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదని పేర్కొన్నారు. స్టూడెంట్ రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉంటుందని వెల్లడించారు. "రాష్ట్ర విభజన తర్వాత నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఉండడంతో తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో ప్రాధాన్యం తగ్గిపోయింది. మీరు మంచి నాయకుడు, మీరు చంద్రబాబు నాయుడుతో కలిసి పని చేస్తే తెలంగాణలో ఇబ్బంది అని ప్రజలు చెప్పారు. దాంతో నేను కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నాను. తెలుగుదేశం కేంద్రంలో ఎన్డీఏతో ఉంది. ఏపీలో ఎన్డీఏ ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్, ప్రభుత్వం ఉంది. నేను రెండింటితో పోరాడాల్సి ఉ ంది. రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్ తో పాటు నా శ్రేయోభిలాషులు కాంగ్రెస్‌లో ఉన్నారు. రాష్ట్రంలో 2014 ఎన్నికల తర్వాత పోటీ కేసీఆర్, రేవంత్ మధ్య పోటీగా మారింది. ఆయన నన్ను అనేక సార్లు జైలుకు పంపారు. నేను అసెంబ్లీకి కన్నా జైలుకే ఎక్కువ సార్లు పోయా. , రాహుల్ గాంధీని కలిసిన తర్వాత 15 నిమిషాలు మాట్లాడాం. ఆ రోజే ఆయన నా నాయకుడని నిర్ణయించుకున్నా. రాహుల్ గాంధీకి ఎటువంటి వ్యక్తిగత అజెండాలు లేవు. ఆయనకు దేశమే ముఖ్యం. నేను విద్యార్థి సంఘంలో ఉన్నా. చంద్రబాబు నాయుడు పార్టీలో ఉన్నా దేశం, రాష్ట్రం కోసం ఏదైనా చేయాలనుకున్నా అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




### భూ సమస్యల శాశ్వత పరిష్కారమే
# రీసర్వే ప్రక్రియ లక్ష్యం

**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**రెవెన్యూ, భూ రీసర్వే, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అంశాలపై ఉమ్మడి జిల్లా స్థాయిలో సమీక్ష సమావేశం.**

**వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28(నమస్తే ఉదయం):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియ భూ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపే మార్గమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం వనపర్తి ఐడీఓసీ సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని రెవెన్యూ, గృహ నిర్మాణం, భూముల సర్వే, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి రాష్ట్ర రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తన సహచర మంత్రులైన ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి హాజరై సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉమ్మడి జిల్లాలోని మండలాల వారీగా భూముల రీ సర్వే ప్రక్రియపై తహసిల్దార్లు, సర్వేయర్లతో ఒక్కొక్కరిగా సమీక్షించి, పురోగతిపై ఆరా తీశారు. అదేవిధంగా సర్వే ప్రక్రియపై రైతుల నుంచి వ్యక్తమవుతున్న అనుభవాలపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... దాదాపు 120 ఏళ్ల క్రితం భూముల సర్వే నిర్వహించారని, మళ్లీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో సమగ్ర రీసర్వే ప్రక్రియను చేపట్టిందని తెలిపారు. ఈ ప్రక్రియను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో, పారదర్శకంగా, పూర్తి బాధ్యతతో నిర్వహించాలని ఆదేశించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ భూముల రీసర్వే ద్వారా భూముల హద్దులు, యాజమాన్యానికి సంబంధించిన సమస్యలతో పాటు సాదా బైనామా ..మిగతా 2లో


### టీజీపీఎస్సీ ఉద్యోగ పరీక్షల
# షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే ఉదయం)**




తెలంగాణలోని నిరుద్యోగులకు కీలక సమాచారం. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పరీక్షల షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు కమిషన్ స్పష్టం చేసింది. లక్షలాది మంది అభ్యర్థులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పలు కీలక పోస్టులకు సంబంధించిన పరీక్షల తేదీలను టీజీపీఎస్సీ ప్రకటించింది. విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పరిధిలోని అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టులకు అక్టోబర్ 24న, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు అక్టోబర్ 26న పరీక్షలు నిర్వహించనున్నారు. అదేవిధంగా, ఆర్ అండ్ బీ శాఖలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) పోస్టులకు నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి. పాఠశాల విద్యాశాఖకు చెందిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి నవంబర్ 12, 13 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయని టీజీపీఎస్సీ వెల్లడించింది. ఈ షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు.

# విద్య, వైద్యానికి అత్యంత ప్రాదాన్యత ఇస్తున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్



**వెల్టూరు గ్రామాన్ని త్వరలోనే మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారం పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28 (నమస్తే ఉదయం):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని వెల్టూర్ గ్రామంలో రూ. 11.75 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న తెలంగాణా పబ్లిక్ స్కూల్, వనపర్తి మండలం చిట్యాల గ్రామ పరిధిలో రూ. 10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న జ్యోతిభా పూలే బాలుర గురుకుల కళాశాల భవనానికి సహచర మంత్రులు రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ...ప్రజలు ఆశీర్వదించిన ప్రజా ప్రభుత్వం విద్యా వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఇందులో భాగంగానే ఈరోజు వెల్టూర్ గ్రామంలో రూ. 11.75 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనానికి శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. తెలంగాణలో పేద విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమమైన విద్య అందించలేకపోయామని ..మిగతా 2లో

### విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు కలెక్టర్లు దృష్టి సారించాలి

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28 (నమస్తే ఉదయం)**

రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు వారికి అందుతున్న మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సంబంధిత ఉ న్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కలెక్టర్లు క్రమం తప్పకుండా రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఆహార విషబాధ, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటుచేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ తెలిపారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశు ధ్య నిర్వహణ, ..మిగతా 2లో

### ఓటుకు నోటు కేసు:
# సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

**రూ. 50 లక్షల ఈడీ అటాచ్‌మెంట్‌ను రద్దు చేసిన అప్పిలేట్ ట్రైబ్యునల్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే ఉదయం)**



2015 నాటి సంచలనాత్మక 'ఓటుకు నోటు' కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భారీ ఊరట లభించింది. ఈ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీ చేసిన రూ. 50 లక్షల ఆస్తుల జప్తు (అటాచ్‌మెంట్) ఉత్తర్వులను అప్పిలేట్ ట్రైబ్యునల్ రద్దు చేసింది. రేవంత్ రెడ్డితో పాటు ఈ కేసులోని ఇతర నిందితులకు కూడా అనుకూలంగా ఈ తీర్పు వెలువడింది. జస్టిస్ మునీశ్వర్ నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 14న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. కేసులో స్వాధీనం చేసుకున్న రూ. 50 లక్షల నగదును ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సీజ్ చేసి, ట్రయల్ కోర్టులో జమ చేసిందని పిటిషనర్లు తమ వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ట్రైబ్యునల్, వివాదాస్పద నగదు ఇప్పటికే కోర్టు అధీనంలో ఉన్నప్పుడు, దానికి సమానమైన మరో మొత్తాన్ని మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జప్తు చేయడం చెల్లదని స్పష్టం చేసింది. నిందితులు ఆ ఆస్తులను బదిలీ చేసే అవకాశం లేనందున ఈడీ అటాచ్‌మెంట్ అవసరం లేదని ధర్మాసనం పేర్కొంది.




### సోమశిల పాటకు ప్రతిష్టాత్మక బెస్ట్ టూరిజం ఫిల్మ్ అవార్డు-2026

**రాష్ట్ర పర్యాటక శాఖ పురస్కారాల్లో 'సోమశిల' పాటకు అరుదైన గౌరవం**

**లిశిల్పారామంలో గౌరవ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అవార్డు ప్రదానం**

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28(నమస్తే ఉదయం):**

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం , పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పర్యాటక పురస్కారాల్లో 'సోమశిల' పాట ప్రతిష్టాత్మక అవార్డును సొంతం చేసుకుంది. 'బెస్ట్ ఎక్సలెన్స్ అవార్డ్ ఇన్ ఫిల్మ్ క్యాటగిరీ' విభాగంలో 'సోమశిల' పాట "బెస్ట్ టూరిజం ఫిల్మ్" అవార్డు కు ఎంపికైంది. ఈనెల 26న హైదరాబాద్‌లోని శిల్పారామంలో అట్టహాసంగా జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా మేడికొండ ప్రసాద్ ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకని, ప్రశంసలు పొందింది. ఈ సందర్భంగా తెలంగాణ పర్యాటక ప్రాముఖ్యతను, సోమశిల కృష్ణవేణి తీరప్రాంతం , ప్రకృతి అందాలను ఈ పాట ద్వారా అద్భుతంగా, శ్రవ్యంగా ఆవిష్కరించారని కొనియాడారు. తెలంగాణ సంస్కృతి, పర్యాటక రంగానికి గుర్తింపు తెచ్చేలా ఈ పాటను మలచిన నడిగడ్డ ప్రాంతానికి చెందిన మేడికుంద ప్రసాద్ ను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

# మురుగుకూపంలో సిద్ధిక్ నగర్.. నిత్యం నరకయాతన!

**రోడ్డుపైనే పొంగిపొర్లుతున్న సీవరేజ్ నీరు.. రోగాల బారిన పడుతున్న స్థానికులు**

**250 మీటర్ల ఆర్‌సీసీ పైప్‌లైన్ నిర్మిస్తేనే శాశ్వత పరిష్కారం: ఆంజనేయులు సాగర్**

**మాదాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం**

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 28, (నమస్తే ఉదయం)**

దినదిన గండం.. నూరేళ్ల ఆయుష్షన్న చందాంగా మారింది సిద్ధిక్ నగర్ వాసుల జీవనం! మురుగునీటి మడుగుల మధ్య, గుబాలిస్తున్న దుర్వాసనను పీలుస్తూ కాలనీవాసులు ఏళ్లుగా నరకయాతన అనుభవిస్తున్నారు. అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధిక్ నగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైంది. ఏ చిన్నపాటి సమస్య వచ్చినా రోడ్లపైకి మురుగు పొంగిపొర్లుతుండటంతో బాటసారులు, వాహనదారులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా చిన్నారులు, వృద్ధులు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతుండటంతో కాలనీ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు చేస్తున్న తాత్కాలిక మరమ్మతులు కేవలం రెండు రోజుల ముచ్చటగానే మారుతున్నాయని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న అంజయ్య నగర్ డివిజన్ వాసులు....



సిద్ధిక్ నగర్ రోడ్లపై పొంగుతున్న మురుగునీరు..

**శాశ్వత పరిష్కారమే లక్ష్యం అధికారులకు విజ్ఞప్తి:**

సమస్యపై తీవ్రతపై అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ సోమవారం సీఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ ని స్వయంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ "ఏళ్ల తరబడి మురుగునీటి మధ్య బతుకుతున్న సిద్ధిక్ నగర్ వాసుల తిప్పలు వర్ణనాతీతం. పాతబడిన డ్రైనేజీ పైప్‌లైన్‌ను పూర్తిగా తొలగించి, దాని స్థానంలో సుమారు 250 మీటర్ల మేర నూతన ఆర్ సీసీ డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. తాత్కాలిక పనులతో ప్రజాధనం వృథా కావడం తప్ప ఫలితం ఉండట్లేదు. సీవరేజ్ బోర్డు అధికారులను తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశించి, అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు యుద్ధప్రాతిపదికన ప్రారంభించాలని కోరారు.

**సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్**

వినతిపత్రం స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ సమస్య తీవ్రతపై సానుకూలంగా స్పందించారు. వెంటనే వాటర్ వర్క్స్, జలమండలి అధికారులతో మాట్లాడి, స్థలాన్ని పరిశీలించి డ్రైనేజీ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిద్ధిక్ నగర్ కాలనీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి, జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, రాము యాదవ్, సదర్ రాము, కె. రాజేందర్ రెడ్డి, వి. రాజేందర్ రెడ్డి, సాయి, రోహిత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో కలకలం.. ఐటీ కారిడార్ ఫుడ్ లవర్స్‌కు షాక్!

**టేస్టీ ఫుడ్.. రోత కిచెన్!**

**వంటగదుల్లో బొద్దింకలు, ఎలుకల సామ్రాజ్యం**

**ప్రముఖ 20 హోటళ్లు, రెస్టారెంట్లలో టీజీ ఎస్ఏఎఫ్ఈ అధికారులు, పోలీసుల మెరుపు దాడులు**

**11 ప్రముఖ సంస్థల ఫుడ్ లైసెన్సులు తక్షణమే సస్పెండ్.. కార్యకలాపాలు బంద్**

**'రమేశ్వరం కేఫ్', 'షాఘౌస్', 'షాదాబ్' సహా 6 ప్రముఖ హోటళ్లకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు**

**శేరిలింగంపల్లి : సెప్టెంబర్ 28, (నమస్తే ఉదయం)**

మెరిసిపోయే భవనాలు.. రంగురంగుల విద్యుత్ కాంతులు.. నోరూరించే ఐటెమ్స్.. కానీ లోపలికి వెళ్తే అదంతా ఒక పెద్ద మాయాజాలం! మనం ఎంతో ఇష్టంగా తినే ఆహారం ఎలుకలు, బొద్దింకలు సంచరించే రోత కిచెన్లలో తయారవుతోందనే పచ్చి నిజం వెలుగులోకి వచ్చింది. రాజధానిలోని ఐటీ కారిడార్ ప్రాంతాలైన మాధాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ పరిధిలోని ప్రముఖ రెస్టారెంట్లు, హోటళ్లపై తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ అధికారులు మెరుపు దాడులతో విరుచుకుపడ్డారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీసులతో కూడిన 10 ప్రత్యేక బృందాలు ఒకేసారి నిర్వహించిన దాడితో ఐటీ కారిడార్‌లోని హోటళ్ల యజమానులకు గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. తనిఖీల్లో వెలుగుచూసిన ఘోరాలు కలుషిత ఆహార పదార్థాల తీవ్రతను బట్టి అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన 11 హోటళ్ల ఫుడ్ లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేస్తూ, వారి కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశారు. మరో 6 సంస్థలకు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు, 3 సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.




గచ్చిబౌలిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేసిన ఆల్ సభా రెస్టారెంట్..

**లైసెన్సులు సస్పెండ్ 11 ప్రముఖ సంస్థలు**

హైటెక్ సిటీ మొనాస్టరీ రెస్టారెంట్ లో బొద్దింకలు, ఎలుకల సంచారం. ఫంగస్ పట్టిన కూరగాయలు, కుళ్లిపోయిన గుడ్లు, లేబుల్స్ లేని, గడువు ముగిసిన బాసి ఆహారం లభ్యం. గచ్చిబౌలిలోని శివాని ది రెస్టారెంట్ అండ్ బార్ లో మురికిగా ఉన్న కిచెన్ ఫ్లోర్, పురుగులు పట్టిన నిల్వ ఆహారం. కనీస పెస్ట్ కంట్రోల్, సిబ్బంది హెల్త్ రికార్డులు కరువైయ్యాయి.

గచ్చిబౌలి అల్ సబా రెస్టారెంట్ లో జిడ్డు పట్టిన గోడలు, అపరిశుభ్రమైన కిచెన్. వంటగదిలోనే సిబ్బంది గుట్కా నములుతూ, సిగరెట్లు కాలుస్తున్నారు. ఫ్రిజ్‌లలో ఉడకబెట్టిన ఆహారం, పచ్చి మాంసం కలిపి నిల్వలను గుర్తించిన అధికారులు.

మాదాపూర్ లోని లక్కీ మల్టీకుసిన్ రెస్టారెంట్ లో ఆహార పదార్థాలపై ఈగలు, బొద్దింకలు. వెజ్, నాన్-వెజ్ ఆహారాన్ని ఒకే చోట తెరిచి ఉంచడం, గడువు ముగిసిన పదార్థాల వాడకం.

మాదాపూర్ సాయిరామ్ మెస్ లో పురుగులు పట్టిన మైదా, మినపప్పు, వెల్లుల్లి. పొంగిపొర్లుతున్న డ్రెయిన్ల మధ్యే వంటకాలు.

గచ్చిబౌలి ఉడుపీస్ ఉపహార్ గాలి, వెలుతురు లేని దారుణ వాతావరణం. మూసుకుపోయిన డ్రెయిన్ల దుర్వాసన, ఎలుకల సమస్య, వాటర్ టెస్టింగ్ నివేదికలు నిల్.

హైటెక్ సిటీ కోల్ స్పార్క్ రెస్టారెంట్ ఫంగస్ పట్టిన 22 కిలోల వేరుశెనగలు, 25 కిలోల మిరియాలు, 8.9 కిలోల జీడిపప్పును అధికారులు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.

మాదాపూర్ కాంచీ కేఫ్ కిచెన్ సీలింగ్ నుంచి సాలెగూళ్లు, పురుగులు సోకిన ముడిసరుకులు, ఈగల మోత.

గచ్చిబౌలిలోని అంతేరా కిచెన్ అండ్ బార్ కుళ్ళిపోయిన, ఫంగస్ పట్టిన కూరగాయలు, పగిలిపోయిన టైల్స్, జిడ్డు పట్టిన కిచెన్.

మాదాపూర్ ఇనార్బిట్ మాల్ లోని అమ్ ఆహా తెలుగు కిచెన్ లో ఆహారంలో బొద్దింకలు సంచారం! ఎలుకలు కొరికిన మయోనైజ్ ప్యాకెట్లను వ్డుతున్నట్లు వెల్లడి.

ఇనార్బిట్ మాల్ లోని ఫ్యూజన్ 9 అమ్నేషియా స్కై బార్ వంటగదిలో ఎలుకల మలం ఆనవాళ్లు ప్రత్యక్షంగా కనిపించడం తీవ్ర కలకలం రేపింది. కుళ్లిన క్యారెట్లు, ఫంగస్ పట్టేసిన పదార్థాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారం.

నోటీసులు అందుకున్న మరికొన్ని బడా హోటళ్లు

పరిశుభ్రతా లోపాలు ఉన్నందున రమేశ్వరం కేఫ్ (మాధాపూర్), ఇష్టా ( గచ్చిబౌలి), సాహిబ్స్ బార్బెక్యూ, పక్కా లోకల్ (హైటెక్ సిటీ), హోటల్ షాదాబ్ (గచ్చిబౌలి), షాఘౌస్ రెస్టారెంట్ (గచ్చిబౌలి) సంస్థలకు అధికారులు 'ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు' జారీ చేశారు. త్వరలోనే మరో సారీ పరిశీలించి మార్పు రాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీటితో పాటు హోటల్ అవసా, మినర్వా గ్రాండ్ తదితర మొత్తం 20 ప్రముఖ హోటల్స్ లో ఈ విస్తృత తనిఖీలు జరిగాయి. బయటకు కనిపించే ఆర్భాటాలు చూసి మోసపోవద్దని, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని ఏ హోటల్‌నూ విడిచిపెట్టబోమని అధికారులు స్పష్టం చేశారు.

# విద్య, వైద్యానికి అత్యంత ప్రాదాన్యత ఇస్తున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్

**మొదటి పేజీ తరువాయి...**



బాధ కలగకుండా ఈరోజు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పేద ప్రజలు తమకు అనారోగ్యం వచ్చినపుడు మెరుగైన వైద్యము చేయించుకోలేక తమ వారు ప్రాణాలు కోల్పోయారని బాధపడకుండా తెలంగాణ ప్రభుత్వం వైద్య రంగానికి ప్రార్ధన తెచ్చి కార్పొరేట్ వైద్యం అందించడం జరుగుతుంది అన్నారు. తమ ప్రభుత్వంలో రైతులను రాజు చేయాలానే ఉద్దేశంతో ఈరోజు రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న బియ్యానికి 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతకు ఇప్పటికే వేలాది ఉద్యోగాలు ఇవ్వడంతో పాటుగా కొత్తగా మరికొన్ని వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఆడబిడ్డలను కోటీశ్వరులు చేయాలనే ఉద్దేశంతో 70 వేల కోట్ల రూపాయలు సున్నా వడ్డీకే రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు అర్హులైన ప్రతి ఒక్కరికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు. గత పాలకులు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి పోయినప్పటికి, గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను అమలు చేస్తూనే ఈ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చందుకు కృషి చేస్తుందన్నారు స్థానిక శాసనసభ్యులు తుడి మెగారెడ్డి అభ్యర్థన మేరకు వెల్టూరు గ్రామాన్ని త్వరలోనే మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో కొన్ని కొత్త మండలాలు ఇవ్వడంతోపాటు కొత్త డివిజన్లు ఏర్పాటు చేయాల్సిన ఉందని, వాటిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ వెల్టూరులో రూపాయలు 11.75 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ వెల్టూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ అతిపెద్ద గ్రామమైన వెల్టూరును మండల కేంద్రం చేయాలని మంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా విద్యాధికారి యాదయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.

**వనపర్తి పట్టణం నల్ల చెరువులో చేప పిల్లల విడుదల**

రాష్ట్ర వ్యాప్తంగా వనపర్తి లోనే చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రులు వనపర్తి జిల్లా వనపర్తి పట్టణం నల్ల చెరువులో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తో కలిసి చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించి, చేప పిల్లలను నీటిలో విడుదల చేశారు. ఈ చేప పిల్లల కార్యక్రమాన్ని ఈ సీజన్లో రాష్ట్రంలోని మొట్టమొదటిసారిగా అనుకొనపర్తిలో ప్రారంభించినట్లు మంత్రులు పేర్కొన్నారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మంత్రులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు

# విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు కలెక్టర్లు దృష్టి సారించాలి

**మొదటి పేజీ తరువాయి...**

ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల లోపాలు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. వంటశాలలను ఆధునీకరించే అవకాశం ఉన్న చోట్ల పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. విద్యాసంస్థల్లోని సౌకర్యాలు, లోపాలు, చేపట్టిన పరిష్కార చర్యల వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులను ఉన్నతస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుంటుందని తెలిపారు. జిల్లాలలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ప్రతికూల నివేదికలు వచ్చినప్పుడు అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని సూచించారు. ఏదైనా సమాచారం తప్పుడు ప్రచారంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, వాస్తవంగా సమస్య ఉన్నట్లు తేలితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి అమలు చేస్తోందని, కాస్మెటిక్ ఛార్జీలను డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని ఆదేశించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇకపై ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు తీసుకోవాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన పథకాల అమలులో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎఫ్ ఆర్ ఎస్, విద్యార్థుల వివరాల నమోదు, ధ్రువీకరణ తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రతి పాఠశాల స్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి పాఠశాలకు సంబంధిత బాధ్యతలు స్పష్టంగా కేటాయించి, రోజువారీ ప్రగతిని పర్యవేక్షించాలని, ఉదయం నిర్ణీత సమయానికి పనుల పురోగతిపై నివేదికలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థికి సంబంధించిన ఫలితాలు, రికార్డులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధార్ వివరాల్లో మిస్‌మ్యాచ్, ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఇతర సాంకేతిక సమస్యలను గుర్తించి వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ పని కూడా నిర్లక్ష్యం లేదా సమన్వయ లోపం కారణంగా నిలిచిపోకుండా అధికారులు వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి, పిడి డిఆర్డిఏ శ్రీలత, పిడి మెప్మా వెంకట్ నారాయణ, సోషల్ వెల్ఫేర్ అధికారి రామరావ్, బీసీ వెల్ఫేర్ అధికారి కేషు రామ్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి వెంకటేష్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ,మైనార్టీ అధికారి, సంబంధిత ఆర్‌సి లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థి దశ నుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు నియోజకవర్గంలో క్రీడలకు పెద్దపీట**

**జిన్నారంలో ఘనంగా ప్రారంభమైన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి పోటీలు**


**పటాన్ చెరు, సెప్టెంబర్ 28( నమస్తే ఉదయం):**

విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంపూర్ణ సహకారం అందించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటుచేసిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలను సోమవారం ఉదయం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కొద్దిసేపు వాలీబాల్ ఆడి అందరిని ఉత్సాహపరిచారు. అనంతరం క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించి, క్రీడాజ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు, క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా క్రమశిక్షణతో పాటు ఉన్నత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెంచేలా వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పటాన్ చెరు నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానాన్ని 7 కోట్ల రూపాయలతో తీర్చిదిద్దడం జరిగిందని తెలిపారు. ఐదు ఎకరాల విస్తీర్ణంతో వివిధ మండలాల్లో మినీ స్టేడియాలు నిర్మిస్తున్నామని తెలిపారు. వివిధ క్రీడ అంశాల్లో ప్రతిభ చూపుతున్న క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థి దశనుండే క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రుల సైతం సంపూర్ణ ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరేందర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదలకు సంజీవని సీఎం సహాయనిధి : నీలం మధు ముదిరాజ్

**లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన నీలం**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 28( నమస్తే ఉదయం):**



కష్టకాలంలో పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఒక సంజీవనిలా మారిందని, పేదల ఆరోగ్య భద్రతకు ఈ నిధి ఎంతో ధైర్యాన్ని ఇస్తుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం చిట్కుల్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని కానుకుంటకి చెందిన కుమ్మరి రామదాసు 60 వేలు ఇస్నాపూర్ మున్సిపాలిటీకి చెందిన అడపా ఎల్లమ్మ( 60,000/-) కు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని తెలిపారు. సరైన సమయంలో వైద్యం అందక, అప్పుల పాలవుతున్న ఎన్నో కుటుంబాలను ప్రభుత్వం ఈ నిధి ద్వారా ఆదుకుంటోందని, నిరుపేదలు అనారోగ్యం బారిన పడినప్పుడు అధైర్యపడకుండా ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ గోపాల్ రెడ్డి, మన్నే రాఘవేంద్ర, నారాయణదాసు, మణికంఠ, సర్పంచ్ కొరివి సురేష్, మాజీ ఉప సర్పంచ్ శోభకృష్ణ రెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాస్, వీరేష్, నర్సింలు, రాము, వెంకటేష్, బిక్షపతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారమే రీసర్వే ప్రక్రియ లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

వంటి దీర్ఘకాలిక సమస్యలకు కూడా పరిష్కారం లభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో రీసర్వేను పకడ్బందీగా నిర్వహించి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు సూచించారు. రీసర్వే కోసం ఆధునిక రోవర్లను అన్ని జిల్లాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. నిర్దేశిత ప్రణాళిక ప్రకారం, నాణ్యతతో రీసర్వే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని, నవంబర్ 15వ తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఆయా జిల్లాల అధికారులు క్రమబద్ధమైన విధానంలో పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు. ప్రతి నెలలో ఒక్కో మండలానికి ఒక రోజును కేటాయించి, ఆ మండలానికి సంబంధించిన ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించాలని తెలిపారు. సాధ్యమైనంతవరకు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు, అర్జీల స్వీకరణ కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేయాలని అన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ... ఇందిరమ్మ గృహాల పర్యవేక్షణకు పలు ఇంజనీరింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పూర్తిస్థాయిలో భర్తీ చేస్తేనే గృహాల నిర్మాణం వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, నాగర్ కర్నూల్ కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ, దేవాదాయ, తదితర శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ఈసీఐలో ఏకపక్ష నిర్ణయాల వల్ల తీవ్రమైన అవకతవకలు జరగడానికి కారణమైన

# ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య డిమాండ్

**బుద్వేల్, సెప్టెంబరు 28 (నమస్తే ఉదయం) :**

ఈసీఐలో ముగ్గురు సభ్యులు కలిగిన కమిటీలో ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు చేస్తూ బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఓట్ల చోరీకి అవకాశం కల్పించిన జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి సిపిఐ జాతీయ సమితి సభ్యులు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం నాడు శంషాబాద్ మండల కేంద్రంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా జంగయ్య పాల్గొని మాట్లాడారు. ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఓట్ల చోరీ కి పాల్పడే అవకాశం కల్పించిన ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్ స్వచ్ఛందంగా రాజీనామా చేయకపోతే పార్లమెంటులో చర్చించి సస్పెండ్ చేయాలని జంగయ్య డిమాండ్ చేశారు .



శంషాబాద్ లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడానికి అధికారులను అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష నాయకుల ఎన్నికల దరఖాస్తులను తిరస్కరించే కుట్రలు చేస్తూ ఇతర పార్టీల ఎమ్మెల్యే ఎంపీలను ప్రలోభ పెట్టి బీజేపీ లోకి చేరే విధంగా ఈ డి. సి బి ఐ ఎన్నికల అధికారులను వాడుతున్నదని ఆయన విమర్శించారు

ఎన్నికల హామీలను అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వం ప్రజాక్షేత్రంలో వ్యతిరేకతను పోగొట్టడానికి మతాన్ని ఒక ఆయుధంగా మలుచుకొని రాజకీయాలు చేయడం సిగ్గుమాలిన చర్యని ఆయన విమర్శించారు

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించే ప్రధాన ఎన్నికల అధికారులు ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఓట్లను తొలగించే కుట్ర చేయడం రాజ్యాంగ విరుద్ధమని అలాంటి వ్యక్తులను తక్షణమే సస్పెండ్ చేయకపోతే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందని జంగయ్య అన్నారు

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, సిపిఐ కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి, ముత్యాల యాదిరెడ్డి, టి రామకృష్ణ , కామెడీ శేఖర్ రెడ్డి , పబ్బుతి లక్ష్మణ్, పల్నాటి యాదయ్య, ఆరు యాదగిరి , నీలమ్మ, పి శివకుమార్, ఎం ఏ రియాజ్ దత్తు నాయక్, కే చందు యాదవ్ , మల్లేష్, పాలమాకుల శ్రీశైలం, కే శ్రీనివాస్ , జె ఆనంద్ గౌడ్, జె విజయ్ ఆనంద్ గౌడ్, గిలక రాజు , నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు



## నేడు మైలార్ దేవుపల్లి విద్యుత్ సెక్షన్‌లో విద్యుత్ సరఫరాల అంతరాయం

**రాజేంద్ర నగర్ సెప్టెంబర్ 28(నమస్తే ఉదయం)**

మైలార్దేవ్ ఈ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు మొఘల్ కాలనీ, మైలర్ దేవ్ పల్లి గ్రామం, ప్రగతి కాలనీ, బృహదావన్ కాలనీ, టాటా నగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.


తలసేమియా చిన్నారులతో లండన్ కు చెందిన అజయ్ గాంధీ

## క్రమ శిక్షణతో కూడిన చికిత్స తలసేమియా రోగులకు మంచిది : అజయ్ గాంధీ

**బుద్వేల్, సెప్టెంబరు 28 (నమస్తే ఉదయం)**

దృఢ సంసకల్పం, క్రమ శిక్షణ తో కూడిన చికిత్స, మెరుగైన వైద్య సంరక్షణ, కుటుంబ మద్దతు, విశ్వాసం, పట్టుదల లు తలసేమియా తో బాదపడుతున్న తనకు 57 సంవత్సరాలుగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ చేసాయని యూకే కు చెందిన అజయ్ గాంధీ అన్నారు. లండన్ కు చెందిన 57 ఏళ్ల తలసేమియా మేజర్ రోగి అయిన అజయ్ గాంధీ సోమవారం రాజేంద్రనగర్ శివరాంపల్లి రాఘవేంద్ర కాలనీ లో గల తలసేమియ సికిల్ సెల్ సోసైటీ (టీఎస్ సీఎస్) ను సందర్శించారు. ఆయన దాదాపుగా ఆరు దశాబ్దాలుగా ఈ వ్యాధి తో జీవిస్తున్నారు. ధీర్గకాలిక రక్త సం బంధిత రుగ్మతతో జీవిస్తున్నప్పటికి తన స్ఫూర్తిదాయకమైన జీవన ప్రయాణాన్ని, అనుభవాలను, ఎదుర్కొన్న సవాళ్లను, అందిపుచ్చుకున్న అవకాశాలను ఆయన అందరితో పంచుకున్నారు. ఈ వ్యాధి తన జీవితంలో ఒక భాగం మాత్రమేనన్నారు. అది తన వ్యక్తిత్వాన్ని నిర్వచించిదని గుర్తు చేశారు. తలసేమియ రోగులకు టీఎస్ సీఎస్ అన్ని సదుపాయాలను ఒకే చోట పూర్తిగా ఉచితంగా అందిస్తున్నందుకు అజయ్ గాంధీ టీఎస్ సీఎస్ ప్రతినిధులను అభినందించారు. దేశంలోని సుదూర ప్రాంతాల నుంచి, కొన్ని సార్లు వెయ్యి కిలోమీటర్ల కు పైగా ప్రయాణించి వచ్చే వారితో సహ, వేలాది మంది రోగులకు సేవలందిస్తున్న టీఎస్ సీఎస్ సొసైటీ ప్రతినిధులందరిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ సీఎస్ అధ్యక్షులు చంద్రకాంత్ అగర్వాల్, చీఫ్ మెడికల్ రీసెర్చ్ ఆఫీసర్, కార్యదర్శి డాక్టర్ సుమన్ జైన్, ఉపాధ్యక్షురాలు రత్నావళి, సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ పద్మ, మనోజ్ రూపాని లు పాల్గొన్నారు.



లండన్ కు చెందిన అజయ్ గాంధీ ని సన్మానిస్తున్న తలసేమియా సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షులు చంద్ర కాంత్ అగర్వాల్, తదితరులు


అంగన్వాడీ టీచర్లను సన్మానిస్తున్న అత్తాపూర్ డివిజన్ బీజేపీ నాయకులు

## ప్రధానమంత్రి 25 సంవత్సరాల ప్రజా జీవనం సందర్భంగా సేవా సంకల్ప్ కార్యక్రమాలు


**రాజేంద్రనగర్, సెప్టెంబరు 28 (నమస్తే ఉదయం) :**

సేవా సంకల్ప్ కార్యక్రమంలో బాగంగా అత్తాపూర్ డివిజన్ లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లను బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో సోమవారం సన్మానిం చారు. డివిజన్ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సరితా రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకులు ఎన్ మల్లారెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడి గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా 25ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న సం దర్భంగా సేవా సంకల్ప్ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్, బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా రెడ్డి, జిల్లా నాయకులు షాబాద్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, గౌరిగె రాజు పహిల్వాన్, విజయ స్వామి, అమర్ రెడ్డి, విజయ రెడ్డి, క్రిష్ణవేణి, శశికళ. రూకేష్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేయాలి

### రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ రవి ప్రసాద్

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 28(నమస్తే ఉదయం)**


రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఇ రవి ప్రసాద్ రావు సన్మానిస్తున్న హెచ్ 82 ఉద్యోగుల సంఘం ప్రతినిధిలో

రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రవి ప్రసాద్ ని హెచ్ 82 ఉద్యోగుల సంఘం సర్కిల్ నూతన కార్యవర్గం ప్రతినిధులు సన్మానించారు. సంఘం కంపెనీ సెక్రటరీ వెంకటేష్ ఆధర్యంలో సర్కిల్ ప్రెసిడెంట్ కావలి ఆంజనేయులు, సర్కిల్ సెక్రెటరీ కిరణ్ కుమార్, రాజేంద్రనగర్, షాద్ నగర్, కందుకూరు డివిజన్ ప్రెసిడెంట్ సెక్రటరీలు అనిల్, సిద్ధులు, మల్లేష్, శివకుమార్, ఉమాకాంత్ రెడ్డి, కృష్ణ సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుమార్ సర్కిల్ డివిజన్ నాయకులు నూతన రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ ఈ రవి ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు నూతన ఎస్ ఈ రవి ప్రసాద్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ నాయకులు ప్రభాకర్ చారి, మాణిక్ రావు, రాజు, శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి: కాంగ్రెస్





కందుకూరు లో కాంగ్రెస్ ర్యాలీ

**బుద్వేల్, సెప్టెంబరు 28 (నమస్తే ఉదయం) :**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చలో కందుకూర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ ఐ ఆర్) ప్రక్రియపై నెలకొన్న వివాదానికి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ఏఐసీసీ తెలంగాణ కో ఆర్డినేటర్ సచిన్ సాంకేత్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చిగురింత పారిజాత నరసింహ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి , జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి , రాజేంద్రనగర్ నియోజకవర్గం డివిజన్ అధ్యక్షులు ఎన్ ధనుంజయ దూడల వెంకటేష్ గౌడ్ సామా ఇంద్రపాల్ రెడ్డి పి శ్రీధర్ రెడ్డి మహేందర్ ముదిరాజ్ బొబ్బిలి శేఖర్ ప్రవీణ్ కృష్ణారెడ్డి గౌస్ అది నాన్ బాయ్ శ్రీరాములు దుర్గేష్ యాదవ్ కోటేష్ గౌడ్ బొల్లా వెంకటేష్ జగదీష్ ఉమామహేశ్వర్ ప్రభాకర్ అంజయ్య నవీన్ సంతోష్ దేవేందర్ బిట్టు తదితరులు పాల్గొన్నారు


మహ్మద్ ఇలియాస్


షేక్ సోహెబ్


షేక్ సుల్తాన్


## తాము గంజాయి విక్రయిస్తున్నామనే సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నాడనే అనుమానంతో స్నేహితుణ్ణి దారుణంగా హత్య చేసిన కేసులో ముగ్గురు యువకుల అరెస్ట్

**బుద్వేల్, సెప్టెంబరు 28 (నమస్తే ఉదయం):**

తాము గంజాయి విక్రయిస్తున్నామనే సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నాడనే అనుమానంతో స్నేహితుణ్ణి కత్తులతో పొడిచి హత్య చేసిన సంఘటన లో ప్రమేయం ఉన్న ముగ్గురు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వివరాలను రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ వెంకటేశ్ వెల్లడించారు. నౌనెంబర్ కు చెందిన మహ్మద్ నసీరుద్దీన్ అహ్మద్ ఖాన్ ఇలియాస్ వసీం (34) సెప్టెంబరు 24న స్నేహితులే దారుణంగా హత్య చేశారు. ఈ హత్యకు గంజాయి విక్రయిస్తున్న సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నాడనే అనుమానాలు కారణమని అప్పట్లో పోలీసులు తెలిపారు. వసీం ను హత్య చేసిన కేసులో ఎం ఎం పహడీ కి చెందిన లేడీస్ టైలర్ మహ్మద్ ఇలియాస్ (28), అదే ప్రాంతానికి చెందిన టైలర్ మహ్మద్ షోహెబ్ అలియాస్ షోహెబ్ (22), అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 242 వద్ద నివాసం ఉంటు సేలే మేన్ గా పనిచేసే షేక్ సుల్తాన్ (23) ను పోలీసులు అరెస్ట్ చేశారు.

**తమ గురించి పోలీసులకు సమాచారం ఇస్తున్నాడనే అనుమానంతో..**

గతంలో హత్యకు గురైన వ్యక్తి తో పాటు హత్య లో పాల్గొన్న వారు నలుగురు గంజాయి విక్రయిస్తు జల్సాలు చేసేవారు. వసీంతో పాటు ఇలియాస్, షోహెబ్ లపై వివిధ పోలీస్ స్టేషన్ లలో కేసులు ఉన్నాయి. కొన్ని రోజులుగా వసీం మిగతా ముగ్గురితో దూరంగా ఉంటున్నాడు. వారిపై ఇటీవల కాలంలో పలు కేసులు నమోదైనాయి. ఈ సమాచారాన్ని వసీం పోలీసులకు ఇచ్చాడని అనుమానం పెంచుకున్న ముగ్గురు ఈ నెల 24న సాయంత్రం పిల్లర్ నెంబర్ 185 వద్దకు వసీం ను పిలిపించి కత్తులతో పొడిచి హత్య చేసి పారిపోయారు. రాజేంద్రనగర్ పోలీసులు విశ్వసనీయ సమాచారం మేరకు మహ్మద్ ఇలియాస్, షేక్ షోహెబ్, షేక్ సుల్తాన్లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. వారి నుంచి ఓ మోటర్ సైకిల్ న్ను కత్తిని, సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.


రాజేంద్రనగర్ తహసిల్దార్ బొమ్మ రాములు కు వినతి పత్రం అందచేస్తున్న చింతల్ మెట్ వాసులు

## చింతల్ మెట్ హస్తాల వీరన్న దేవాలయం స్థలం ను కాపాడాలి : భక్తులు

**బుద్వేల్, సెప్టెంబరు 28 (నమస్తే ఉదయం)**

చింతల్మెట్ హస్తాల వీరన్న దేవాలయంలోని కోనేరు (గుండం) పక్కనే ఉన్న మసీదు కమిటీ సభ్యులు దేవాలయం స్థలంలో ప్రహరీగోడ నిర్మిస్తున్నారని, దానిని పరిశీలించి న్యాయం చేయాలని కోరుతు స్థానికులు సోమవారం రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు ను కలసి వినతి పత్రం అందజేశారు. దేవాలయం భూములను కాపాడాలని కోరారు. స్థానిక భక్తులు దేసం నర్సింగ్ యాదవ్, దండుగుల శ్రీనివాస్, తండా రాజు గౌడ్, బండ క్రిష్ణ యాదవ్, పులి కాశీనాథ్, శ్రీకాంత్ లు ఫిర్యాదు చేసిన వారి లో ఉన్నారు. ఈ విషయమై దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు మోహన్ రెడ్డి , రమాదేవి లకు కూడా విన్నవించడం జరిగిందన్నారు. అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య కు కూడా సమస్యను వివరించామన్నారు. పురాతన హస్తాల వీరన్న దేవాలయానికి భద్రత కల్పించి, స్థలాలను కాపాడాలని కోరారు. ఈ విషయమై బీజేపీ నాయకులు వై.శ్రీధర్, జి బాబురావు, వెం కట్ రెడ్డి, విజయ్, విక్రం చారి లు సైతం అధికారులను కలసి సమస్యను వివరించారు. తహసీల్దార్ బొమ్మ రాములు, ఇన్స్ పెక్టర్ సీతయ్య, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు స్థల పరిశీలన చేసి తెలిపారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని చింతల్ మెట్ కు చెందిన భక్తులు తెలిపారు



భగత్ సింగ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య, మజ్లిస్ నాయకులు, సిక్కు సోదరులు

## దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయస్సు లోనే ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి భగత్ సింగ్

**బుద్వేల్, సెప్టెంబరు 28 (నమస్తే ఉదయం)**

భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన 24 సం వత్సరాలకే ప్రాణ త్యాగం చేసిన వీరుడు భగత్ సింగ్ అని అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య అన్నారు. 1907 సెప్టెంబరు 28న ఇప్పటి పాకిస్తాన్ లో ఉన్న లాయల్ జిల్లా బంగా గ్రామంలో కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు భగత్ సింగ్ జన్మించాడన్నారు. భారత్ లో బ్రిటీష్ పాలనను వ్యతిరేకిస్తు విప్లవాత్మక ఉద్యమాలను చేపట్టిన కుటుంబంలో ఆయన జన్మించాడని గుర్తు చేశారు. యుక్త వయస్సులోనే ఐరోపా విప్లవ ఉద్యమాల గురించి చదివిన భగత్ సింగ్ స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్ హత్య నేపధ్యంలో ఒక పోలీసు అధికారిని కాల్చినందుకు భగత్ సింగ్ ను ఉరి తీశారన్నారు. ఆయనకు దేశం పట్ల ఉన్న ప్రేమ ను నేటి యువత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు నవాజుద్దీన్, తాహెర్, సిక్కు సోదరులు పాల్గొన్నారు.

## పోలీసు శాఖలో క్రీడాస్ఫూర్తిని, శారీరక దృఢత్వాన్ని,
# ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని ప్రోత్సహించేందుకు క్రీడలు

**ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ**
**డైరెక్టర్ అభిలాష బిస్త్**

**రాష్ట్రవ్యాప్తంగా 700 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణ:::**

**హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే ఉదయం)**



పోలీసు శాఖలో క్రీడాస్ఫూర్తిని, శారీరక దృఢత్వాన్ని, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని మరింత ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్--2026లో భాగంగా క్లస్టర్--జ (బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్) పోటీలు సోమవారం ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు అకాడమీ క్రీడా భవన్ వేదికగా నిలిచింది. లాన్ టెన్నిస్ పోటీలు వట్టినాగులపల్లి వేదికగా నిర్వహిస్తున్నారు.:::: అకాడమీ క్రీడా భవన్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్, బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ ఆడి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. క్రీడాకారులను ఉత్సాహపరిచి, పోటీల్లో క్రీడాస్ఫూర్తితో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని ఆమె ఆకాంక్షించారు. పోలీస్ విధుల్లో నిరంతరం ఒత్తిడితో పనిచేసే సిబ్బందికి క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, జట్టు స్ఫూర్తిని పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ వరకు.. 700 మందికి పైగా పోలీస్ క్రీడాకారులుక్లస్టర్--జ పోటీల్లో తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల నుంచి కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారుల వరకు 700 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వివిధ ర్యాంకులకు చెందిన అధికారులు ఒకే వేదికపై క్రీడాకారులుగా పాల్గొనడం ఈ క్రీడా పోటీల ప్రత్యేకతగా నిలిచింది. తెలంగాణ స్పోర్ట్స్ ఐజీ డాక్టర్ గజారావు భూపాల్ పర్యవేక్షణలో, స్పోర్ట్స్ డీఎస్పీ డాక్టర్ ఎన్.వి. వెంకటేశ్వర్లు సమన్వయంతో వివిధ క్రీడలకు సంబంధించిన డ్రాలు, ప్లేయర్ల జాబితా తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేశారు.:::

**పటిష్టమైన సమన్వయంతో పోటీల నిర్వహణ:::**

అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు ఓవరాల్ ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరిస్తుండగా, ఔట్‌డోర్ అసిస్టెంట్ డైరెక్టర్ యార్లగడ్డ రాంబాబు నోడల్ అధికారిగా సమన్వయం చేస్తున్నారు.


లాన్ టెన్నిస్‌కు డీఎస్పీ తిరుపతి, బ్యాడ్మింటన్‌కు జి. జగదీశ్వరరావు, టేబుల్ టెన్నిస్‌కు డీఎస్పీ శ్రీరాములు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు, వసతి, భోజనం, క్రీడా ప్రాంగణాలు తదితర ఏర్పాట్లను అకాడమీ అధికారులు సమన్వయంతో పూర్తి చేశారు. పోటీల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయగా, ఔట్‌డోర్ డీఎస్పీ తోట శ్రీనివాసులు కంట్రోల్ రూమ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.:::

**ప్రొబేషనరీ డీఎస్పీల ఉత్సాహభరిత భాగస్వామ్యం::::**

ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐదుగురు ప్రొబేషనరీ డీఎస్పీలు -- మనీష్, సాయికిరణ్, లతేఫా ఆషా, నేహా పురోహిత్, ప్రవీణ్ ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారు. బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో వారు తమ ప్రతిభను ప్రదర్శిస్తుండటం అకాడమీ శిక్షణలో విధి నిర్వహణతో పాటు క్రీడలు, శారీరక దృఢత్వానికి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. ప్రారంభ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్, డిప్యూటీ డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ వేముల శ్రీనివాసరావు, స్పోర్ట్స్ డీఎస్పీ డాక్టర్ ఎన్.వి. వెంకటేశ్వర్లు, డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు, వివిధ క్రీడల ఇన్‌చార్జి అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

**క్రీడలతో ఆరోగ్యం.. పోలీస్ శాఖలో స్ఫూర్తి, ఐక్యత**

మూడు రోజుల పాటు జరిగే క్లస్టర్--సి పోటీల్లో రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్లకు చెందిన క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. క్రీడల ద్వారా పోలీస్ సిబ్బందిలో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి, పరస్పర స్నేహభావం మరింత బలోపేతం అవుతాయని అధికారులు తెలిపారు.



ప్రజల నుండి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 28(నమస్తే ఉదయం)**

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవిస్తూ మొత్తం 89 అర్జీలు సమర్పించారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రజల నుంచి అర్జీలనుస్వీకరించివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అందుతున్న ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 54 అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించి 35 అర్జీలు, మొత్తం 89 అర్జీలు అందాయి. ప్రతి అర్జీపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టి, పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు.. సమగ్ర విచారణకు డిమాండ్

**బీజేవైఎం రాష్ట్ర నాయకుడు పల్లె తిరుపతి**

**మిడ్జిల్, సెప్టెంబర్ 28: నమస్తే ఉదయం**

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ బీజేవైఎం రాష్ట్ర నాయకుడు పల్లె తిరుపతి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నారని, ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మిడ్జిల్ మండలం వెలుగోముల గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఓ నిరుపేద మహిళ ఇల్లు కూలిపోయినప్పటికీ నేటికీ ఆమెకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిలువ నీడ కోల్పోయిన బాధితురాలికి ప్రభుత్వం నుంచి సహాయం అందకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఇలాంటి నిరుపేదలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ఇళ్లు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, అర్హుల జాబితాను గ్రామసభల్లో పరిశీలించాలని పల్లె తిరుపతి కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హుల జాబితాకు గ్రామసభ ఆమోదం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వెలుగోముల గ్రామంలో ఇప్పటివరకు జరిగిన ఇళ్ల కేటాయింపులను పరిశీలించి, అర్హులకు అన్యాయం జరిగిందా అనే విషయాన్ని తేల్చాలని అధికారులను కోరారు. వర్షాలకు ఇల్లు కోల్పోయిన బాధితురాలి పరిస్థితిని అధికారులు స్వయంగా పరిశీలించి, ఆమె అర్హతను నిర్ధారించి వెంటనే ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారుల ఎంపికపై వచ్చిన ఆరోపణలను విచారించి, అర్హులైన నిరుపేదలందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో సమర్పించిన ఫిర్యాదులో కోరారు.

## మహిళా పోలీస్ స్టేషన్‌లో
# ఎస్పీ వార్షిక తనిఖీ

**బాధితులతో గౌరవంగా, సున్నితంగా వ్యవహరించాలి..**
**కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 28(నమస్తే ఉదయం)**




జిల్లా మహిళా పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్ పి డి. జానకి సోమవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులను, కేసుల వివరాలను, పిటిషన్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, ఫిర్యాదుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళలు, బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో సున్నితంగా, గౌరవంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. బాధితుల వ్యక్తిగత వివరాలు, కేసులకు సంబంధించిన సమాచారంలో గోప్యత పాటించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఫిర్యాదులపై సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల పట్ల పూర్తి క్రమశిక్షణతో వ్యవహరించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని ఎస్పీ పేర్కొన్నారు. పోలీసులపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేసేలా విధులు నిర్వహించాలని సూచించారు. స్టేషన్‌లోని రికార్డులు, నిర్వహణ తీరును సమర్థవంతంగా కొనసాగించాలని అధికారులకు తెలిపారు. ఈ వార్షిక తనిఖీలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణయ్య, ఎస్సైలు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులకు మేమంటోలు అందజేత

**ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 28 (నమస్తే ఉదయం)**

భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం మొదటి వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మండలి విప్ శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి కమిటీ అద్యక్షులు భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి నాగిరెడ్డి కమిటీ సభ్యులకు మోటంటోలు అందచేసి వారికి శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. కమిటీ ఉపాధ్యక్షులు నాగేశ్వర్ రావు, బాబు, నరేష్ కుమార్, మధు, నాగేందర్ వెంకటేష్యాదవ్, లలిత యాదవ్, అపర్ణ చౌదరి, డేవిడ్, మూర్తి, బిక్షపతి గౌడ్, సత్యనారాయణ, రాంబాబు, వెంకటేష్, సంతోష్, కవిత తో పాటు స్తానిక కూకట్ పల్లి నాయకులు కొండారెడ్డి, వేణు, సతీష్ రెడ్డి, సంజీవ రావు లు పాల్గొన్నారు.




## ప్రజాస్వామ్య పరిరక్షణకు దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతాం

**ఓటర్ల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాల్లో మరింత పారదర్శకత ఉండాలి**

**అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 28 (నమస్తే ఉదయం)**

భారత ఎన్నికల సంఘం స్వతంత్రత, విశ్వసనీయత, సంస్థాగత సమగ్రతను పరిరక్షించాలనే డిమాండ్‌తో, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నుంచి తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చెప్పినట్లుగా ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టే విధంగా ఎన్నికల సంఘం వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాల్లో మరింత పారదర్శకత ఉండాలని అన్నారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, ఓటర్ల హక్కులను కాపాడాల్సిన ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు తలెత్తేలా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు భారీసంఖ్యలో పాల్గొన్నారు.



## దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం భగత్ సింగ్

**యువతకు ఆయన జీవితం స్ఫూర్తి - కోడిచెర్ల మహేందర్**

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 28 (నమస్తే ఉదయం)**

షహీద్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా బీజేపీ మూసాపేట్ డివిజన్ అధ్యక్షులు పండుగ జానకి ఆధ్వర్యంలో మూసాపేట్‌లోని హనుమాన్ చౌక్ వద్ద భగత్ సింగ్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ హాజరై భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోడిచెర్ల మహేందర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుడు షహీద్ భగత్ సింగ్ అని కొనియాడారు. దేశం కోసం ఆయన చేసిన త్యాగం, ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి యువతకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు శైలేష్, మల్లేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, సీనియర్ నాయకులు రమేష్, శ్రీనివాస్ రెడ్డి, గిరి, రవి గౌడ్, ప్రశాంత్, కృష్ణ, స్వామి, రాజేశ్వరి, రాధ, శ్రవణ్, బాలమణి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొని షహీద్ భగత్ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు.



## సర్‌పై సమీక్ష సమావేశం నిర్వహించిన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 28 (నమస్తే ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు టెలీ కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు, సోమవారం ఫతేనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తన కార్యాలయంలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్) పై 5 బూత్ ల ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ గౌడ్ మాట్లాడుతూ ఇప్పటివరకు నోటీసులు అందుకున్న వారిలో కేవలం 30% మంది మాత్రమే సంబంధిత పత్రాలు సబ్మిట్ చేసి ఓటు హక్కును నమోదు చేసుకున్నారని, మిగతా వారు స్పందించడం లేదని తెలిపారు. దీనివల్ల రాబోయే కాలంలో ఎన్నికలు వచ్చినప్పుడు గానీ, ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా గానీ ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా క్షేత్ర స్థాయిలో బి ఎల్ ఓ లతో కలిసి మన పార్టీ బి ఎల్ ఏ లు సమన్వయం చేసుకుంటూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చేలా చూడాలని బూత్ ఇన్‌చార్జ్‌లకు సూచించారు. ఈ సమావేశంలో 5 బూత్‌ల ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు కంచి బిక్షపతి, సుదర్శన్ రెడ్డి, డేవిడ్, సాంబశివరెడ్డి, నగేష్, అఫ్జల్, కృష్ణకుమారి, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. “RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733